



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు సవిత, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

చేనేతల కల సాకారం

- అట్టహాసంగా మెగా టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపన
- చేనేతలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత

ఎమ్మిగనూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా చేనేతలు ఎదురు చూస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కు కల ఎట్టకేలకు సాకారమైంది. ఎమ్మిగనూరు మండలం బనవాసిలో ఏర్పాటు చేయనున్న మెగా టెక్స్‌టైల్ పార్కుకు మంగళవారం రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రావడంతో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి 365 రోజులు పని కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. క్లస్టర్లు ఏర్పాటు చేసి చేనేత ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు విక్రయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్రేమ్‌లూంను 90శాతం సబ్సిడీపై అందజేయడంతో పాటు యారన్‌తో పాటు మిగతా ముడి సరుకులను సొసైటీల ద్వారా సబ్సిడీ ధరలకు అందజేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

మిగతా 6వ పేజీలో

ఇంటర్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు విడుదల



నంద్యాల ఎడ్యుకేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లను ఇంటర్మీడియట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. విద్యార్థులు కళాశాల లాగిన్ నుంచి గాని, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుంచి గాని, మన మిత్ర వ్యాట్సాప్ నుంచి గాని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు డీఐఈఓ సునీత తెలిపారు. నంద్యాల జిల్లావ్యాప్తంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు 14వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఇంటర్ ఫస్టియర్ 5,540 మంది, సెకెండ్ ఇయర్ 2,291 మంది విద్యార్థులు ఉన్నారు. వారితో పాటు 6,200 మంది విద్యార్థులు మెరుగైన మార్కుల కోసం(ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు రాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాల్లో పరీక్షలు జరిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

12 నుంచి పరీక్షలు : ఈనెల 12వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మే 12 నుంచి 20వ తేదీ వరకు థియరీ పరీక్షలు, మే 28వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. జూన్ 4న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, జూన్ 6వతేదీ పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించనున్నారు.

డ్రైడేను అమలు చేయండి

- ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి
- డీఎంహెచ్‌వో వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖాధికారి

నంద్యాల హాస్పిటల్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి శుక్రవారం డ్రైడేను కచ్చితంగా అమలుచేయాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. మంగళవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే మలేరియా, డెంగీ వ్యాధులు జిల్లాలో తక్కువగానే ఉన్నాయని, వైద్యసిబ్బంది ప్రభుత్వ సూచనలు పాటించి అమలు చేయాలని అన్నారు. మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి జబ్బుల బారిన పడకుండా సూచనలు ఇవ్వాలన్నారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు అవగాహన కల్పించి మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడకుండా సబ్‌యూనిట్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చేవారికి రక్త పరీక్షలు చేయించి మలేరియా నిర్ధారణ అయిన వెంటనే ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి డాక్టర్ కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి రామ విజయారెడ్డి, జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగ్గురు వైద్యాధికారులపై చర్యలు?

- ముఖ గుర్తింపు హాజరులో ట్యాంపరింగ్
- ఐఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ హాజరు
- విచారణలో నిర్ధారణ

6

బార్ల మాటున..

అసలే బార్లు... ఆపై మంచి డిమాండ్.. ఇంకేముంది అధికారులకు కాసుల వర్షమే. జిల్లాలో బార్ల చాటున అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు జోరందుకుంటున్నాయి. ఎక్కడికక్కడ నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయాలు చేసే బార్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిబంధనలకు పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 22 బార్ల నుంచి కొందరు అధికారులు నెలవారీ మామూళ్లను డిమాండ్ చేస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బార్లలో కూడా ఎమ్మార్పీకి మించి అధికంగా మద్యం విక్రయాలు సాగించి మందుబాబులను నిలువు దోపిడీ చేస్తున్నారు. బార్లలో కనీస నిబంధనలు కూడా అమలు కావడం లేదు.

\- నంద్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి)



నంద్యాలలోని ఓ బార్ వద్ద ఇలా..



- అధికారులకు కాసుల వర్షం
- నెలకు రూ.లక్షల్లో ముడుపులు?
- జిల్లా వ్యాప్తంగా 22 బార్లు
- భారీగా అక్రమ వసూళ్లు
- చక్రం తిప్పుతున్న ఆ ముగ్గురు

పర్మిట్ రూమ్‌ల వ్యూహం

కొందరు అధికారుల అండతో నిబంధనలకు పాతరేసి మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఈ పర్మిట్ రూమ్‌లు అధికం కావడంతో బార్ల నిర్వాహకులు అందరూ ఏకమై ఆ పర్మిట్ రూమ్‌లను లేకుండా చేయాలని ఆ శాఖలోని అధికారులకు ఇటీవలి కాలంలో పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే పర్మిట్ రూమ్‌లు ఉన్న మద్యం దుకాణాల నుంచి కొందరికి మామూళ్లు వస్తుండడంతో కథ అడ్డం తిరిగింది. అయినప్పటికీ బార్ల నిర్వాహకులు పర్మిట్ రూమ్‌లను లేకుండా చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇలా మద్యం దుకాణదారులు, బార్ల యజమానుల నుంచి పోటాపోటీ ఏర్పడటం కొందరు అధికారులకు వరంగా మారింది. తనిఖీ బృందాల్లో పనిచేస్తున్న కొందరు సీఐలు, ఎస్ఐలు, డిపోలోని కొందరు అధికారులు, సిబ్బందితో పాటు ఆ బృందాలకు మరికొందరు ముడుపుల వ్యవహారంలో చక్రం తిప్పుతున్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. మొత్తం మీద ఓ ముగ్గురు అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.



నంద్యాలలోని మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్ ఇలా.. (ఫైల్)

భారీగా ముడుపులు..?



జిల్లా వ్యాప్తంగా 127 మద్యం దుకాణాలు. 22 బార్లు ఉన్నాయి. ఇందులో నంద్యాల పట్టణంలో 15, ఆళ్లగడ్డ 1, ఆత్మకూరు 1, నందికొట్కూరు 1, కోవెలకుంట్ల 1, బనగానపల్లె 1, డోన్ 2 చొప్పున బార్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బయట పోలీసుల తనిఖీలు, ఇతరత్రా కారణాలతో చాలామంది మద్యం ప్రియులు బార్లకు వెళ్తుంటారు. మద్యం డిపోల నుంచి తమదైన శైలిలో డిమాండ్ కలిగిన బ్రాండ్లను సరఫరా చేసే విధంగా కొందరు బార్ల నిర్వాహకులు పైరవీలు సాగిస్తున్నారు. ఇదే క్రమంలో కొన్నిచోట్ల నాసిరకం మద్యం, లూజ్ విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. బార్ల నిర్వాహకులు నిబంధనలు పాతరేస్తున్నారు. పరిశీలించి కట్టడి చేయాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 22 బార్ల నుంచి రూ.8 లక్షలకు పైగానే ముడుపుల రూపంలో కొందరు అధికారులకు ప్రతి నెల అందుతోందని తెలిసింది. ఈ లెక్కన ఒక్కో బార్ నుంచి సరాసరి నెలకు రూ.40 వేలు చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ఎక్కువ మద్యం విక్రయాలు ఎక్కడే జరిగితే అక్కడ ముడుపుల ధర పెరుగుతూ ఉంటుంది.

నిబంధనలకు పాతరేసి..!

జిల్లాలోని బార్లలో కనీస నిబంధనలు కూడా పాటించడం లేదు. మద్యం నుంచి తినే ఆహారం వరకు అక్కడ మద్యం ప్రియులను ఆయా నిర్వాహకులు అధిక ధరలతో దోపిడీ చేస్తున్నారు. నాసిరకం మద్యం విక్రయాలు, నాణ్యతలేని ఆహారం తయారీ చేసి మద్యం ప్రియులకు అమ్మేస్తున్నారు. బార్లపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు సివిల్ పోలీసులు సదరు బార్ల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. ఎవరైనా మద్యం దుకాణాలు, బార్ల నుంచి మామూళ్లు రాకపోతే ఆయా ప్రాంతాల్లో ఉన్న బార్లు, దుకాణాల సమీపంలో మద్యం ప్రియులు బయటకు రాగానే డ్రంకెన్ డ్రైవ్ పేరుతో జరిమానాలు విధించి ఆయా నిర్వాహకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు దోచుకుంటుంటే తామేం తక్కువ కాదంటూ బార్ల నిర్వాహకులు మందు బాబులను నిలువుదోపిడీ చేస్తున్నారు.



మందుబాబులను తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రచండ భానుడు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా రోడ్లు
- బండిఆత్మకూరులో 42.2 డిగ్రీల సెల్సియస్ నమోదు



నిర్మానుష్యంగా నూనెపల్లె రోడ్

నంద్యాల ఎడ్యుకేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): భానుడు ఉగ్రరూపం దాల్చాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జనాలు రోడ్లపై వచ్చేందుకు జంకుతుండటంతో రోడ్లన్నీ మధ్యాహ్నం ఒంటి గంట లోపే నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మంగళవారం ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదయ్యాయి. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలంలో 42.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గోస్పాడు 42.14, బనగానపల్లె 41.96, సంజామల 41.91, దొర్నిపాడు 41.67, కోవెలకుంట్ల 41.48, పాణ్యం 41.09, జూపాడుబంగ్లా 40.98, రుద్రవరం 40.89, ఆళ్లగడ్డ 40.87, చాగలమర్రి 40.67, శిరివెళ్ల 40.35, కొత్తపల్లె 40.35, గడివేముల 40.2, మహానంది 40.07, పాములపాడు 40.0, నందికొట్కూరు 39.75 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణసంస్థ వెల్లడించింది.

కర్నూలు జిల్లాలో..

మంత్రాలయంలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కోసిగి 41.4, కోడుమూరు 41.0, కౌతాళం 40.9, నందవరం 40.29, హొళగుంద 39.9, సి.బెళగల్ 39.9, వెల్దుర్తి 39.86, ఏర్వకల్ 39.79, క్రిష్ణగిరి 39.79, పెద్దకడబూరు 39.72, ఆదోని 39.7, ఎమ్మిగనూరు 39.5, చిప్పగిరి 39.5, కోసిగి 39.2, ఆలూరు 38.7, కర్నూలునగరం 38.67 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

జీఎస్టీ వసూళ్లలో కర్నూలు టాప్

- ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.99.55 కోట్ల రాబడి
- వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు

కర్నూలు న్యూసిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే కర్నూలు జిల్లా జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా జరిగినట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఏప్రిల్‌లో రూ.89.404 కోట్లు జీఎస్టీ రాగా, ఈ సంవత్సరం ఏప్రిల్‌లో రూ.99.55 కోట్లు జీఎస్టీ వసూళ్లు అయిందన్నారు. ఈమేరకు 12 శాతం పెరుగుదల కనిపించిందన్నారు. జిల్లాలో గ్రీన్‌ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, మైనింగ్ తదితర కార్యకలాపాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఆన్‌లైన్ జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని గమనించి నాలుగు నెలల నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రతి నెల 200కు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. గతంలో నేరుగా తనిఖీలు చేపట్టేవారమని, ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జీఎస్టీ చెల్లించకుండా అక్రమంగా వస్తువులను రవాణాచేసే వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తామన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో వస్తువులను స్వాధీనం చేసుకుని పంపుతామన్నారు. అనంతరం ఆ వస్తువులను వేలం వేస్తామన్నారు. ఇటీవల ఆదోనిలో స్థానిక పోలీసులతో కలిసి ఓ బంగారు వ్యాపారి వద్ద అక్రమ బంగారాన్ని గుర్తించి రూ.9లక్షలు జరిమానా విధించామన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ సుధాకర్‌రావు

పనులు త్వరగా పూర్తి చేయండి

నీటిపారుదల శాఖ సీఈ కబీర్ బాషా

జూపాడుబంగ్లా, మే 6(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎంసీ విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ సీఈ కబీర్‌బాషా కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం పోతిరెడ్డిపాడు విస్తరణలో భాగంగా జరుగుతున్న ఎస్ఆర్ఎంసీ కాలువ లైనింగ్ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఆయన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 16 కిలోమీటర్ల పొడవున బానకచర్ల నీటిసముదాయం వరకు పనులను తనిఖీ చేశారు. సీఈ వెంట డీఈ నాగేంద్రకుమార్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా

ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు స్థలాలు గుర్తించండి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాట్లకు స్థలాలు గుర్తించాలని కలెక్టర్ రాజకుమారి ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇంటిగ్రేటెడ్ రూరల్ ఎనర్జీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ భూములు, స్థల సేకరణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ పాణ్యం, సుగాలిమెట్ట ప్రాంతాల్లో 50ఎకరాల వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, సంబంధిత ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో కలిసి పరిశీలించాలని నంద్యాల, డోన్, ఆర్డీఓలను ఆదేశించారు. ఆత్మకూరు మండలంలో కూడా ప్రభుత్వ భూములు 2.5 ఎకరాల మేర ఉంటే పరిశీలించాలన్నారు. రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ఐదు వేల ఎకరాలను గుర్తించి నివేదికలు ఇవ్వగా అందులో 765 ఎకరాల్లో ఏర్పాటుచేయడానికి రిలయన్స్ సంస్థ నుంచి అంగీకారం వచ్చిందన్నారు. గడివేములలో 300 ఎకరాలు, చాగలమర్రిలో 105, రుద్రవరంలో 190, ఆళ్లగడ్డలో 170 ఎకరాలు ఉన్నాయని సదరు భూముల్లో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, ఆర్డీఓలు చల్లా విశ్వనాథ్, నాగజ్యోతి, నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

బిల్లుల కోసం ఎదురుచూపు

● ఉమ్మడి జిల్లాలో రూ.150.04 కోట్లతో 1,916 పనులు ● కర్నూలు జిల్లాలో వందశాతం, నంద్యాల జిల్లాలో 98.80 శాతం పనులు పూర్తి ● ఇప్పటి వరకు విడుదలైన బిల్లులు రూ.23.75 కోట్లు ● పెండింగ్‌లో రూ.126.29 కోట్లు ● ఇబ్బందుల్లో కాంట్రాక్టర్లు



కర్నూలు న్యూసిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలలకు పల్లెల్లో అంతర్గత రోడ్లు (సీసీ రోడ్లు) నిర్మించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పనులు మంజూరు చేశారు. పల్లె పండుగ వారోత్సవాలంటూ గత సంవత్సరం అక్టోబరు 14 నుంచి 20వ తేదీ వరకు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ శాతం మంది వైసీపీ మద్దతుదారులైన సర్పంచులు ఉన్నారు. అయితే కూటమి నేతలు ఇష్టానుసారంగా రోడ్లను మంజూరు చేయించుకున్నారు. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అన్ని పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పనులు పూర్తి అయినా నేటికీ బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టులు దక్కించుకున్న చిన్న, పెద్ద కూటమి నేతలు తీవ్ర ఇబ్బందుల్లో ఉండిపోయారు. గ్రామాల్లో అప్పులు చేసి పనులు పూర్తి చేసిన వారు నేడు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక దిక్కులు చూస్తున్నారు.

రూ.150.04 కోట్లతో 1,916 పనులు

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.150.04 కోట్లతో మొత్తం 1916 పనుల్లో భాగంగా 270.25 కిలోమీటర్ల మేర గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి వరకు 268.51 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో వంద శాతం, నంద్యాల జిల్లాలో 98.84 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.23.75 కోట్లు విడుదల అయ్యాయి. ఇంకా ఐదు నెలల నుంచి రూ.126.29 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత గడువును కూడా విధించిన నేపథ్యంలో పల్లెల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు హడావుడిగా పనులు పూర్తి చేశారు. నిన్న మొన్నటి వరకు గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని ఆరోపణలు చేసిన కూటమి నేతలు ప్రస్తుతం తమ ప్రభుత్వంలో బిల్లుల విడుదలపై నెలకొన్న జాప్యంపై ప్రశ్నించే స్థితిలో కనపడటం లేదు. చేసిన పనులకు చేసినట్లుగా ఎం.బుక్ రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేసిన రెండు, మూడు రోజులకు బిల్లులు పడిపోతాయని చెప్పిన దానికి ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకుండా పోయింది.

తనిఖీలు అంతంతమాత్రంగానే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు వేగంగా చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడుదల కాకపోవడం వల్ల పలు ప్రాంతాల్లో చేసి పనులకు సంబంధించిన క్వాలిటీపై కూడా దృష్టి సారించనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం..క్యూరింగ్ కూడా సరిగ్గా చేయనట్లు తెలుస్తోంది. రోడ్ల నాణ్యతపై పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీరు కూడా అధిక రోడ్ల పనులు జరుగుతున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండటంతో ఆయా పనుల పట్ల పూర్తి స్థాయిలో ఆ వైపు తనిఖీలు చేపట్టలేదని వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1916 పనుల్లో ఇప్పటి వరకు 50 శాతం పనులకు కూడా క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు తనిఖీ చేయకపోవడం గమనార్హం. నాణ్యత పరిశీలించిన పనుల్లో కూడా సుమారు 50 నుంచి 60 శాతం పనుల్లో రికవరీకి ఆదేశించినట్లు సమాచారం. అయితే పూర్తయిన పనులకు వంద శాతం బిల్లులు చెల్లింపులు జరగలేదు. మొత్తం బిల్లులో 15 శాతాన్ని డిపాజిట్‌గా ఉంచుకుని, క్వాలిటీ చెక్ చేసిన అనంతరం డిపాజిట్‌గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేస్తారని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



త్వరలోనే బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంది

ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులకు త్వరలోనే బిల్లులు విడుదల అయ్యే అవకాశం ఉంది. ఉపాధి పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ కింద కొంత శాతం నిధులు విడుదల అయ్యాయి. ఈ క్రమంలోనే పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు బిల్లులు విడుదల కానున్నాయి. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులను అప్‌లోడు చేస్తున్నారు.

- వి.రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ, కర్నూలు

బీటీ రోడ్ల పరిస్థితి అంతే..

సీసీ రోడ్ల దారిలోనే బీటీ రోడ్డుకు సంబంధించి బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 4, నంద్యాల జిల్లాలో 3 పనులు మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో రూ.13.30 కోట్లతో 14.89 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 3.50 కిలోమీటర్లు మాత్రమే వేశారు. ఈ పనులకు కూడా ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా విడుదల కాని పరిస్థితి నెలకొంది.



ఫెన్సింగ్ క్రీడ ఆడుతున్న దృశ్యం (ఫైల్)

దేశానికే ఆదర్శం రాష్ట్ర క్రీడా పాలసీ

● నిరుద్యోగులకు వరం స్పోర్ట్స్ కోటా
● ప్రతిభగల క్రీడాకారులకు సదవకాశం

నంద్యాల హాస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన క్రీడా పాలసీ దేశానికే ఆదర్శం. ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రీడాకోటా 3శాతానికి పెంచి ఆదర్శంగా నిలిచింది. దేశంలో అన్ని రాష్ట్రాలు 2శాతం స్పోర్ట్స్ కోటా అమలు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 2నుంచి 3శాతానికి క్రీడా కోటాను పెంచింది. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు ఎలాంటి పోటీ పరీక్ష లేకుండా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఐదుగురు కమిటీ సభ్యులను ఏర్పాటు చేసి క్రీడాకారుల సర్టిఫికెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరిశీలించి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. కమిటీ సిఫార్సుల మేరకు ఏపీపీఎస్సీ ఆయా విభాగాల్లో ఉద్యోగాలు కేటాయించనుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న డీఎస్సీలో కూడా 3శాతం కోటాను అమలు చేయడం విశేషం. దీంతో నిరుద్యోగులకు స్పోర్ట్స్ కోటా వరంగా మారింది. ఆటలు అన్నం పెడతాయా అన్న నానుడి పక్కకుపోయినట్లు కనిపిస్తోంది. ఎంచుకున్న క్రీడలో కఠోర సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలిగే సత్తా ఉన్న క్రీడాకారులకు జీవితంలో ఉద్యోగం సంపాదించి స్థిరపడే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. కాగా 65 క్రీడా అంశాల్లో ఏ, బీ కేటగిరీలుగా చేయడంపట్ల కొంతమంది క్రీడాకారులు, క్రీడా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎ-కేటగిరీలో పూర్తయిన తర్వాతనే బి-కేటగిరి క్రీడాకారులకు అవకాశం ఇవ్వనున్నారు.

ఎ-కేటగిరి క్రీడాంశాలు ఇవే

ఆక్వాటిక్స్, అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, బేస్‌బాల్, చెస్, సైక్లింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, గోల్ఫ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, జూడో, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కబడ్డీ, ఖోఖో, మోడ్రన్ పెంటాతలన్, రోయింగ్, రోలర్‌స్కేటింగ్, రగ్బీ, షూటింగ్, సాఫ్ట్‌బాల్, స్క్వాష్, ట్రయాతలన్, టెన్నిస్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ అండ్ బీచ్‌వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, సెయిలింగ్.

కేటగిరి-బీ క్రీడాంశాలు

ఆక్యాపాట్యా, బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్, బాడీబిల్డింగ్, బ్రిడ్జ్, క్యారమ్స్, సైకిల్ పోలో, ఐస్‌హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కీయింగ్, కరాటే, మాల్కంబ్, మోటార్‌స్పోర్ట్స్, నెట్‌బాల్, పెన్‌కాక్‌సిలత్, పోలో, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్‌బాల్, రోల్‌బాల్, సెపక్‌తక్రా, సాఫ్ట్ టెన్నిస్, టెన్నికాయిట్, టెన్నిస్‌బాల్ క్రికెట్, టెన్‌పిన్‌బౌలింగ్, థగ్‌ఆఫ్‌వార్, ఉషూ, యాచింగ్, యోగాసన, డెఫ్‌స్పోర్ట్స్, క్రికెట్ మొదలైనవి బీ క్రీడాంశాలు.

క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది



రాబోయే రోజుల్లో క్రీడలకు మరింత ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల క్రీడాకారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో ఫెన్సింగ్ క్రీడాకారులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. నూతన స్పోర్ట్స్ పాలసీ అమలులో శాప్ ఛైర్మన్ భాగస్వాములు కావడం సంతోషం.

- లక్ష్మణ్, ఫెన్సింగ్ కోచ్, డీఎస్ఏ నంద్యాల.

డీఎస్సీలో ఉద్యోగమే లక్ష్యం



ప్రస్తుతం జరగబోయే డీఎస్సీలో ఉద్యోగమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా అమలు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. 2023లో కోయంబత్తూరులో జరిగిన పారా ఫెన్సింగ్‌లో జాతీయ స్థాయి బ్రాంజ్ మెడల్ సాధించా. డీఈడీ పూర్తిచేసి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా.

- ప్రసన్న, జాతీయ ఫెన్సింగ్ బ్రాంజ్ మెడలిస్ట్, నంద్యాల

క్రీడలన్నింటినీ సమానంగా చూడాలి



క్రీడా పాలసీలో ఏ, బీ కేటగిరీలు చేయడం సరి కాదు. ఎంతో కష్టపడితేకానీ అంతర్జాతీయ స్థాయికి ఎదగలేం. 2024సెప్టెంబరు 20నుంచి 24వరకు చైనాలో జరిగిన ఏషియన్ బీచ్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఈ చాంపియన్‌షిప్‌లో రెగూ విభాగంలో బ్రాంజ్ మెడల్ వచ్చింది. బీఎస్సీ పూర్తిచేశా. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం వస్తుందనే ఆశాతో ఉన్నాను.

- మధు, అంతర్జాతీయ బ్రాంజ్ మెడలిస్ట్, ఆలూరు

క్రీడాకారులకు మంచి అవకాశం



ప్రతిబా వంతులైన క్రీడాకారులకు ఇది మంచి అవకాశం. క్రీడల్లో అత్యున్నతస్థాయికి వెళితే ఉద్యోగం ఖాయం. ప్రభుత్వ క్రీడా పాలసీ క్రీడలకు ప్రోత్సాహ కరంగా ఉంది. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో క్రీడలకు మంచి గుర్తింపురానుంది.

- ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు, ఏపీ పీఈటీ ఎస్ఏపీఈ

వివాదంలో కేఎంసీ క్యాంటీన్

● తమకు అప్పగించాలంటున్న ఏపీజీడీఏ
● ఆ సంఘమే లేదన్న క్యాంటీన్ నిర్వాహకులు
● ఇబ్బందుల్లో వైద్య విద్యార్థులు, వైద్యులు



క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీజీడీఏ నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ)లో క్యాంటీన్ వివాదం నెలకొంది. అక్కడ పనిచేసే వైద్యులు, జూనియర్ డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులు, ఉద్యోగులకు అల్పాహారం, భోజనం అందించే క్యాంటీన్ వివాదంలో చిక్కుకుంది. క్యాంటీన్‌ను తమకు అప్పగించాలని, పదవీ విరమణ పొందిన వారి పెత్తనం ఏమిటని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కేఎంసీ యూనిట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డా.పి.బ్రహ్మాజీ మాస్టర్, డా.ఎస్.సోమన్న ప్రశ్నిస్తున్నారు. మరో వైపు క్యాంటీన్ నిర్వాహకులు డా.వరప్రసాద్ అసలు ఏపీజీడీఏ అసోసియేషన్ అనేది లేదని, ఇప్పుడు ఉన్నవారు గ్రూపుగా తయారయ్యారని అంటున్నారు. దీంతో క్యాంటీన్ మాదంటే మాది అని వివాదం నెలకొంది. మంగళవారం ఉదయం ఏపీజీడీఏ నాయకులు క్యాంటీన్‌ను సందర్శించారు. మరో పక్క మధ్యాహ్నం 3.50గంటలకు డా.వరప్రసాద్ దీనికి కౌంటర్‌గా ప్రెస్‌మీట్ పెట్టారు. దీంతో వైద్యవిద్యార్థులు, వైద్యులు క్యాంటీన్ లేక అవస్థలు పడుతున్నారు.

48 గంటల్లో ఖాళీ చేయాలి



క్యాంటీన్‌ను 48 గంటల్లో ఖాళీచేసి ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘానికి అప్పగించాలని వారు క్యాంటీన్ సిబ్బందికి ఆ సంఘం అధ్యక్షుడు డా.పి.బ్రహ్మాజీ మాస్టర్, ఉపాధ్యక్షుడు డా.సోమప్ప అల్టిమేటం జారీచేశారు. ఈక్యాంటీన్ కాలేజీ ఆవరణలో ఉందని, ఏపీజీడీఏ అసోసియేషన్ క్యాంటీన్‌ను డా.వరప్రసాద్‌కు ఐదేళ్ల మాత్రమే లీజ్‌కు ఇచ్చామన్నారు. క్యాంటీన్ అగ్రిమెంటు 30 ఏళ్లు ఉంటే ఆపత్రాలు చూపించాలన్నారు. 2024లో మూసివున్న క్యాంటీన్‌ను తమకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇది అన్యాయమన్నారు. గత 15 నెలలుగా క్యాంటీన్ లేక ఇబ్బంది పడుతున్నామని, మా క్యాంటీన్‌ను అప్పగిస్తే సౌకర్యాలు కల్పించుకుని అందరికీ ఉపయోగంలోకి తెస్తామన్నారు. ఏపీజీడీఏకు నిబంధనల మేరకు ఎన్నికలు జరిగాయన్నారు.

విభజన తర్వాత అసోసియేషన్ లేదు

రాష్ట్ర విభజన తర్వాత ఏపీజీడీఏ అసోసియేషన్ అనేది లేదని, ఇప్పుడు ఉండేవారు గ్రూపుగా తయారై డబ్బులు కోసం పని చేస్తున్నారని క్యాంటీన్ నిర్వాహకులు డా.వరప్రసాద్ ఆరోపించారు.



మంగళవారం క్యాంటీన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. క్యాంటీన్‌ను అప్పగించాలని అంటున్న వైద్యులు తనను ప్రశ్నించే హక్కు లేదన్నారు. 30 సంవత్సరాల అగ్రిమెంటు ఉందా లేదా అనేది కోర్టులో తేలుతుందన్నారు. అనంతపురం మెడికల్ కాలేజీలో తాను పని చేస్తున్నానని, లాంగ్ లీవ్‌లో ఉన్నాననీ, డీఎంఈకి పోస్టింగ్ కోసం లెటర్ రాశానన్నారు. తాను సర్వీసులో ఉన్నానన్నారు.

- డాక్టర్ వరప్రసాద్, క్యాంటీన్ నిర్వాహకుడు, కర్నూలు

చేనేతల కల సాకారం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో చేనేతలకు హెల్త్ పాలసీని అమలు చేస్తామన్నారు.

తండ్రి కలను సాకారం చేసిన తనయుడు

-ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ శాఖ మంత్రి



ఎమ్మిగనూరు అంటే దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డికి ఎంతో ఇష్టం. ఎప్పుడూ ఎమ్మిగనూరు గురించే ఆలోచించేవారు. బీవీ మోహన్‌రెడ్డి అంటే ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టం. బీవీ మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఎంతో మంది రాజకీయ నాయకులను తయారు చేశారు. అయితే వారే ఆయనకు వెన్నుపోటు పొడిచారు. రాష్ట్రప్రభుత్వం చేనేతలను ఆర్థికంగా బలపరచాలన్న ఉద్దేశంతో ఇలాంటి పార్కులను ఏర్పాటు చేస్తోంది. చేనేత పార్కు ఏర్పాటు చేయాలని బీవీ మోహన్‌రెడ్డి కలలు కన్నారు.. ఆ కలను ఆయన తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి సాకారం చేశారు.

● చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కును మొదటి ఫేస్‌లో అభివృద్ధి చేయడానికి ఏపీఐఐసీ నుంచి రోడ్లు, నీటి సదుపాయం కల్పించేందుకు రూ.6.9కోట్ల నిధులు కేటాయింపు చేశామని వెల్లడించారు. చేనేతలకు త్వరలో ఐడెంటీ కార్డులు ఇప్పిస్తామన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 8 నియోజకవర్గాల్లో స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు వీరభద్రగౌడు, రాఘవేంద్రరెడ్డి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, పరిశీలకులు శ్రీరాములు, జనసేన నాయకురాలు రేఖాగౌడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఏడీహెచ్ నాగరాజరావు, ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ ఉపేంద్రబాబు, ఏపీఐసీసీ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మెగా టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి



సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషి వల్లే టెక్స్‌టైల్ పార్కు సాధ్యమైంది. ఎంఎస్ఎంఈ పార్కులో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో రూ.7కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. మిగిలిన 55 ఎకరాల్లో టెక్స్‌టైల్ అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎమ్మిగనూరు పేరిట శాలువలు తయారు చేస్తే టీటీడీతో పాటు ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ చేసేందుకు సహకరిస్తా.

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



సభకు హాజరైన చేనేతలు, ప్రజలు

యువగళంలో హామీని నెరవేర్చిన నారా లోకేశ్



యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకే 11 నెలల్లోనే ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేశాం. 2004లో నా తండ్రి బీవీ మోహన్‌రెడ్డి అపెరల్ పార్కు తీసుకువస్తే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ సంస్థను పులివెందులకు తరలించుకుపోయారు. 2014లో ఇక్కడే ముఖ్యమంత్రి చంద్రబాబు హోదాలో టెక్స్‌టైల్ పార్కుకు స్థలం కేటాయించారు. ఆ కక్షతోనే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ చేనేతలపై ఇబ్బందులకు గురి చేసేలా ఉపాధికి ఉపయోగపడే పార్కు స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి తన నైజాన్ని చాటుకున్నాడు.

- జయనాగేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. కొందరు అభివృద్ధిపై కారు కూతలు కూస్తున్నారు.. వారి నోరు మూయించేలా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందులో భాగమే ఎమ్మిగనూరులోని టెక్స్‌టైల్ పార్కు. వైసీపీ హయాంలో చేనేతలను నాశనం చేసేందుకే టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు.

- పార్థసారథి, ఎమ్మెల్యే, ఆదోని

10 నుంచి టీజీవీ కళాక్షేత్రంలో సాంస్కృతిక వారోత్సవాలు

కర్నూలు కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ 75వ జన్మదిన సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలో పదో తేదీ నుంచి 'సాంస్కృతిక వారోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారం భమవుతాయని, 10న గజల్ గాయకుడు ఎస్.మహమ్మద్ మియా నిర్వహణలో జానపద సంగీత నృత్య విభావరి ఉంటుందని తెలిపారు. ఇందులో అనంతపురం, కర్నూలు కళాకారులు పాల్గొంటారని తెలిపారు. 11న శ్రీరా మాంజనేయ యుద్ధం (వార్‌సీను) ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి కళాకారులు మొలగవల్లి రవి, నెల్లూరు ఈశ్వర్ గౌడ్ పాల్గొం టారని తెలిపారు. 12న సాయంత్రం కవయిత్రుల సమ్మేళనం ఉంటుందని, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండె బోయిన పార్వతీదేవి ఆధ్వర్యంలో కవయిత్రులు పాల్గొంటారు. 13న నగరంలోని శాస్త్రీయ నృత్య శిక్షణలు ఇచ్చే నాట్యాచార్యులతో శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయి. 14న గాయని సుధారాణి, గజల్ గాయకుడు మహమ్మద్ మియా పర్యవేక్షణలో సినీ సంగీత విభావరి ఉంటుంది. 15న టీజీవీ కళాక్షేత్రం సహాయ కార్య దర్శి సంగా ఆంజనేయులు పర్యవేక్షణలో 'బావా ఎప్పుడు వచ్చితీవు' సాం ఘిక నాటక ప్రదర్శన ఉంటుంది. 16న జబర్దస్త్ ఫేం కళాకారులతో హాస్యవల్లరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ కళాకారులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని, కళ, సంగీత, సాహిత్యాభిమానులు హాజరై ఈసాంస్కృతిక వారోత్సవాలను విజయవంతం చేయాలని పత్తి ఓబులయ్య కోరారు.

ముగ్గురు వైద్యాధికారులపై చర్యలు?

● ముఖ గుర్తింపు హాజరులో ట్యాంపరింగ్
● ఐఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ హాజరు ● విచారణలో నిర్ధారణ



నంద్యాలలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

నంద్యాల హాస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ముఖ గుర్తింపు హాజరులో ట్యాంపరింగ్‌కు పాల్పడిన ముగ్గురు వైద్యాధికారులపై క్రమ శిక్షణ చర్యలు చేపట్టనున్నారు. వైద్యారోగ్య శాఖలో సిబ్బంది హాజరు కోసం ముఖ గుర్తింపు పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొందరు సిబ్బంది ఇదే అదనుగా చూసుకొని విధులకు హాజరు కాకపోయినా సెల్‌ఫోన్ ద్వారా చూపిస్తూ ఉండటం ఉన్నతాధికారులు పసిగట్టారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేసే వైద్యాధికారులు ట్యాంపరింగ్ చేసినట్లు నిర్ధారణ అయింది. నంద్యాల జిల్లాలోని ముగ్గురు వైద్యులకు వైదారోగ్య శాఖ గత నెలలో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జిల్లా వైద్య శాఖాధికారులకు ఎఫ్ఆర్ఎస్ హాజరుపై విచారణ చేపట్టాలని సూచించింది. షోకాజ్ నోటీసులు అందుకున్న వైద్యులు వివరణను సక్రమంగా ఇవ్వలేకపోయారు. వారిపై క్రమశిక్షణపై చర్యలు తీసుకోవాలని ఇటీవల డీఎంహెచ్‌వో వెంకటరమణను ప్రభుత్వం ఆదేశించింది. నారాయణపురం పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ దినేష్, దొర్నిపాడులో పనిచేస్తున్న డాక్టర్ రహంల్లాఖాన్, నంద్యాలలో పని చేస్తున్న డాక్టర్ ఇలియాస్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ముగ్గురికి చార్జీ మోమోలు ఇచ్చేందుకు జిల్లా అధికారులు సిద్ధం చేశారు.

ట్యాంపరింగ్ వాస్తవమే

జిల్లాలో ముగ్గురు వైద్యాధికారులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు ట్యాంపరింగ్ చేసిన విషయం వాస్తవమే. రాష్ట్ర శాఖ నుంచి ముగ్గురు వైద్యులపై క్రమ శిక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముగ్గురికి చార్జిమెమోలు సిద్ధం చేశాం.

- డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

కొమ్మ కొమ్మకూ పక్షి



మండు వేసవిలో ఓ వైపు చెట్లు ఎండిపోతున్నాయి. ఉన్న చెట్లకు ఆకులు రాలిపోతున్నాయి. ఎండలకు తట్టుకోలేక పక్షులు సైతం చల్లటి స్థావరాల కోసం అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలో కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం చెరువు వద్ద ఓ మోడుబారిన చెట్లపై పక్షుల గుంపు ఇలా వాలిపోయి సరికొత్త అందాన్ని సృష్టించాయి.

- కర్నూలు రూరల్ (ఆంధ్రజ్యోతి). ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు

చెట్టు చెట్టుకూ చీర




ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. ఈ ఎండ వేడిమి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. మరీ ముఖ్యంగా పండ్ల తోటల రైతులు పంటను రక్షించుకునేందుకు శ్రమిస్తున్నారు. రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామంలో రైతులు బొప్పాయి పండ్లకు రక్షణకు చీరలు చుట్టారు. ఎండ నుంచి సంరక్షించుకునేందుకు ఇలా కొత్తగా ఆలోచిస్తున్నారు. పండ్లు ఉన్న ప్రతి చెట్టుకూ చీరను చుట్టి ఎండ నుంచి రక్షణ పొందుతున్నామని రైతులు శేఖర్, రాముడు, హుసేనీ తెలిపారు.

- రుద్రవరం (ఆంధ్రజ్యోతి)

మట్టి మిద్దె కూలి..

- ఇద్దరు భవన నిర్మాణ కార్మికుల దుర్మరణం
- మరో ఇద్దరికి గాయాలు



ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లెలో కూలిన మట్టి మిద్దె

ఉయ్యాలవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): మట్టి మిద్దెను పెకిలిస్తుండగా పైకప్పు కూలి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఉయ్యాలవాడ మండలం ఆర్.పాంపల్లె గ్రామంలో చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆర్.పాంపల్లెకు చెందిన గంప తిరుపాలు మట్టి మిద్దెకు మరమ్మతులు చేయిస్తున్నాడు. మిద్దె పైకప్పు కూలి అదే గ్రామానికి చెందిన బోగాకు నారాయణ(40), ఆళ్లగడ్డ మండ లం ఎస్.లింగందిన్నెకి చెందిన బండి యోనా(45) అక్కడికక్కడే మృతి చెం దారు. మట్టి మిద్దెకు మరమ్మతులు చేయటానికి ఆళ్లగడ్డ, ఎస్.లిగందిన్నె గ్రామాలకు చెందిన ఏడుగురు రూ.11వేలకు గుత్తకు ఒప్పుకొని శనివారం ఉదయం పనులు ప్రారంభించారు. మిద్దెకింద ఉన్న బండలను మంగళ వారం తొలగిస్తుండగా ఒక్కసారిగా పైకప్పు కూలి నారాయణ, యోనాలు, కుమార్, బాబులపై పడింది.



నారాయణ(ఫైల్)



యోనా (ఫైల్)

నారాయణ, యోనాలు మట్టి కింద కూరుకు పోగా కుమార్, బాబులు గాయాలతో బయట పడ్డారు. మిగిలిన ముగ్గురు ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. మట్టిలో కూరకుపోయిన వారిని వెలికి తీసి ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు.

అనాథలైన కుటుంబీకులు

ఇంటి పెద్దలను కోల్పోవటంతో ఇరు కుటుంబాలుకు చెందిన వారు అనాథలుగా మిగిలారు. అనాథలుగా మిగిలారు. వారు ప్రతి రోజూ కూలీ పనికి వెళ్తే తప్ప పూట గడవని పరిస్థితి వారిది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారు చేస్తున్న అర్తనాదాలు పలువురిని కంట తడిపెట్టిం చాయి. మృతుడు నారాయణకు ఐదేళ్ల క్రితం మొదటి భార్య చనిపో వటంతో మూడేళ్ల క్రితం అనంతపురం జిల్లాకు చెందిన లలితను వివిహం చేసుకున్నాడు. వీరికి 30రోజుల వయస్సున్న కుమార్తె ఉంది. మొదటి భార్య సంతానం ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు యోనాకు నలుగురు కుమార్తెలు, భార్య లీలావతి ఉన్నారు. పెద్దకుమార్తె ఆరుణకు రెండేళ్ల క్రితం వివామమైంది. రెండో కుమార్తె స్వప్న దివ్యాంగురాలు, మూడవ కుమార్తె రాణి ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉండి తల్లి దండ్రులకు సహాయపడుతోంది. నాల్గవ కుమార్తె బేబి ఇంటిర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేసింది. ఈ ఘటనపై ఉయ్యాలవాడ ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

మద్దికెర, మే 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపి న వివరాలు.. మండలంలోని పెరవలి గ్రామంలోని బీసీ కా లనీలో మంగళి నాగరాజు(38) నివాసం ఉంటున్నాడు. త నకున్న మూడెకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరా లు కౌలుకు తీసుకుని సద్ద, కంది పంటలను సాగుచేశాడు. రెండేళ్లుగా పంటలు చేతికి రాలేదు. ఈఏడాది కూడా పం టలు ఆశాజనకంగా లేకపోవడంతో దిగుబడి కూడా రాక.. అప్పులు మరింత ఎక్కువయ్యాయి. అప్పులు రూ.6 లక్షల వరకు చేరాయి. వారం రోజుల నుంచి దిగాలుగా ఉండే వాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం తన ఇంటి ముందు వరండాలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్సకోసం పత్తికొండ ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు నాగరాజుకు ముగ్గురు కుమార్తెలు ఉ న్నారు. భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజ యకుమార్‌నాయక్ కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ఆస్పత్రికి తరలించారు. ఈ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నాయకులు మంగళి రంగస్వామి విజ్ఞప్తి చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మంగళి నాగరాజు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని పరామార్శించారు.



నాగరాజు(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడు..

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమా దంలో హైదరాబాదుకు చెందిన వీరేన్ (17) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. హైదరాబాదు నుంచి కడపకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో వీరేన్ తీవ్రంగా గాయపడటంతో నంద్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీ పనులకు వెళ్లి..

- విద్యుదాఘాతంతో ఇద్దరు యువకుల మృతి
- మృత్యువులోనూ వీడని స్నేహబంధం
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం

కౌతాళం, మే 6(ఆంధ్రజ్యోతి): వారిద్దరు స్నేహితులు.. కలిసి కూలీ పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మంగళ వారం కూలీ పనులకు వెళ్లారు. విద్యు దాఘాతానికి గురై మృత్యువులోనూ స్నేహ బంధాన్ని వీడకుండా ఇరు వురు అనంత లోకాలను చేరని హృదయ విదారక ఘటన మండ లంలోని ఉరుకుంద గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఉరుకుంద గ్రామంలోని దళితకాలనీకి చెందిన కట్టమీద సునీల్ అలియాస్ నాని(24), అదేకాలనీకి చెందిన మహేంద్ర(23) స్నేహితులు. ప్రతిరోజు ఇద్దరు కలిసి కూలీ పనులకు వెళ్ళి కుటుంబాలను పోషించేవారు. రోజువారీ కూలీలో భాగంగా మంగళవారం ఉదయం గ్రామంలోని ఓ సంఘం కల్యాణ మంటపంలో జరుగు వివాహ కార్యక్రమానికి టెంట్ వర్క్ కోసం పనులకు వెళ్లారు. టెంట్ వేస్తున్న సమయంలో పక్కన ఉన్న విద్యుత్ తీగలను గుర్తించలేదు. ఇనుప కడ్డీలు విద్యుత్ తీగలకు తగిలాయి. చేతుల్లో ఉన్న కడ్డీలకు విద్యుత్ సరఫరా అయ్యింది. వారిద్దరూ ఒకేసారి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ పెద్ద అకాల మృతితో తమకు దిక్కెవరని సునీల్ భార్య వినిత రోదిస్తున్న తీరు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది. సునీల్‌కు భార్యతో పాటు రెండేళ్ల కుమార్తె, ఐదు నెలల కుమారుడు ఉన్నాడు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ కేసు చేసి మృత దేహాలను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సునీల్, మహేంద్ర(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన పట్టణ సమీపాన మంగళ వారం చోటుచేకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వివరాలు.. వెంకటాపురం నుంచి డోన్ వస్తున్న ట్రాక్టర్ పెద్ద వంక వద్ద ద్విచక్ర వాహనం తప్పించబోయి లక్ష్మింపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్(20) ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సోదరుడు తిరుమలేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు, పోలీసు సిబ్బంది ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మా నవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం ప్రభుత్వ కార్యక్రమాలు ముగిం చుకుని డోన్ మండలం హైవే మీదుగా మంత్రి పెనుగొండకు బయలుదేరారు. బుచ్చ యగారిపల్లె నుంచి హైదరాబా దుకు మామిడికాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ టైరు పేలిపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనంతపురం జిల్లా పెరవలి మండలం సుబ్బరాయునిపల్లె గ్రామానికి చెందిన డ్రైవర్ శ్రీనివాసులకు, క్లీనర్ నాగరాజుకు గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న మంత్రి గమనించి తన కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. తన కాన్వాయ్‌లో ఉన్న ప్రథమ చికిత్స కిట్టుతో బాధితులకు తన సిబ్బదితో వైద్యం చేయించారు. అంబులెన్స్ ద్వారా డోన్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



క్షతగాత్రులకు సిబ్బందితో ప్రథమ చికిత్స చేయిస్తున్న మంత్రి సవిత

9 నుంచి ఇరవై సూత్రాల కమిటీ చైర్మన్ పర్యటన

- తెలుగు గంగ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇరవై సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించ నున్నట్లు తెలుగు గంగ ఎస్ఈ శివప్రసాదర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తేదీల్లో గోరుకల్లు రిజర్వాయర్‌ను తనఖీచేసి కర్నూలు సోలార్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారని, అనంతరం అహోబిలం, యాగంటి పుణ్య క్షేత్రాలను సందర్శించి కర్నూలు జిల్లా జోహ రాపురంలో పర్యటి స్తారని పేర్కొన్నారు. పర్యటన అనంతరం నంద్యాల కలెక్టర్‌తో సమావేశమై రాత్రి ప్రము ఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం వెళ్లి రాత్రి బస చేస్తారని తెలిపారు. 11వ తేదీ ఆదివారం ఉదయం శ్రీశైల భ్రమరాంబ స్వామి అమ్మవార్ల దర్శనాంతరం ఆత్మకూరులో పర్య టిస్తారు. అత్మకూరు పర్యటన ముగిశాక విజయవాడ బయలుదేరి వెళ్తారన్నారు.

నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలి

- కరెంటు, రైతు సమస్యలపై పోరాటాలకు సిద్ధంకావాలి
- నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నాయకులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం కర్నూలులోని తన స్వగృహంలో ఆయన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కాటసాని మాట్లా డుతూ కరెంటుచార్జీల పెంపు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి పోరా టాలకైనా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బీజేంద్రనాథ్ రెడ్డి నందికొట్కూరు ఇన్‌చార్జి దారా సుధీర్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల విజయ డెయిరీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



మృతి చెందిన ఆవుదూడ వద్ద బాధితుడు సేవా నాయక్

ఆవుల మందపై పెద్దపులి దాడి

వెలుగోడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని మద్రాసు కాలువ సమీపంలో పెద్దపులి వరుసగా రెండో రోజు పెద్దపులి ఆవులమందపై దాడి చేసింది. ఈ దాడిలో మంగళవారం తెల్లవారుజామున ఓ ఆవుదూడ మృత్యువాత పడింది. మొదటిరోజు ఆవుపై దాడి చేయగా ఆవు మృతి చెందింది. ఆ ప్రాం తానికి చేరుకున్న అటవీ అధికారులు ఆ ఆవుల మందను మరో ప్రాంతానికి తరలించారు. అయినప్ప టికీ పెద్దపులి ఆ ఆవుల మందపై తిరిగి దాడి చేసింది. గత రెండు రోజుల నుంచి సేవానాయక్ చెందిన ఆవుల మందపై పెద్దపులి దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. సంఘటన స్థలానికి అటవీ అధికారులు చేరుకొని వివరాలు సేకరించి పలు సూచనలు తెలిపారు. ఆవుల మందపై దాడి చేస్తున్న సమయంలో ఆపులిని ఆవులమంద యజమాని తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పెద్దపులిని సైతం చూపించడం గమనార్హం.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

- డ్వామా పీడీ వెంకట రమణయ్య

ఆలూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగు చేసే చిన్నసన్న కారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సా హం అందిస్తుందని డ్వామా పీడీ వెంకట రమణయ్య అన్నారు. మంగళవారం పెద్దహోతూరు ఉపాధిహామీ పథకం కించ చేసిన నీటి కుంటలు పండ్ల తోటలను పరిశీలించారు. ఐదు ఎకరాలల్లోపు పొలం ఉన్న రైతులకు మామిడి, జామ, సపోట తదితర మొక్కలు అందిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనుల్లో 1.06లక్షల మంది పని చేస్తున్నారు. మే చివరి నాటికి 2వేల నీటి గుంతలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పెండింగ్ ఉపాధి కులీలకు వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. సీసీ రోడ్లు, గోకల షెడ్ల బిల్లులు త్వరలో విడుదల అవుతాయని తెలిపారు. ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆలూరులో పండ్ల తోటలను పరిశీలిస్తున్న పీడీ

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

తాగునీటి కష్టాలు తలెత్తకుండా చర్యలు



బోరువెల్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ఆత్మకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, టీడీపీ పట్టణాధ్యక్షులు జెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా వేయనున్న బోరువెల్ వాహనానికి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చొరవతో రూ.10లక్షల నిధులతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఏరియాల్లో బోరుబావులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో సిద్దేపల్లి రస్తా సమీపంలో గల మంచినీళ్ల బావి వద్ద 3బోర్లు, వడ్లరామాపురం రస్తాలో మంచినీళ్ల బావి వద్ద 2బోర్లు, గరీబ్‌నగర్‌లో మరో 2బోర్ల చొప్పున మొత్తం 7 బోరుబావులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నా శ్రీధర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత అడ్మిషన్లు

ఆత్మకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25శాతం ఉచిత అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు ఎంఈవో-1 బాలాజీనాయక్, ఎంఈవో-2 సురేష్ పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. మే నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్ నమోదుకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

పాములపాడు: మండలంలోని ప్రైవేటు పాఠశాలలో చేరేందుకు పేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటయించామని, ఆసక్తి గల విద్యార్థులు ఒకటవ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు.

అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకోండి

ఆత్మకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసుకోవాలని ఆత్మకూరు మండల ప్రత్యేక అధికారి తులసీ, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వారు ఆత్మకూరు పట్టణంలో గృహాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలతో పాటు చెంచు గిరిజనులకు రూ.లక్ష చొప్పున అదనపు సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు మే 31వ తేదీలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లయితే అదనపు ఆర్థిక సాయం అందనుందని వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ లేఔట్లలోని గృహ నిర్మాణాలను పరిశీలించారు. వీరి వెంట హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాయక్, సుబ్బలక్ష్మమ్మ ఉన్నారు.

మిడుతూరు: ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ అన్నారు. మంగళవారం మిడుతూరు, నాగలూటి గ్రామాల్లోని హౌసింగ్ కాలనీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈయన వెంట హౌసింగ్ ఈఈ విజయబాబు, ఎంపీడీవో దశరథరామయ్య, హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ బాస్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యోగేష్ , వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

ఆత్మకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే చట్టాలను రద్దు చేయాలని 20న చేపట్టే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పెద్దబజారులో ఆటో సర్వీస్ ఆధ్వర్యంలో 139వ మేడే ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రణధీర్, నూర్, రహం ఉన్నారు.

ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలి

ఆత్మకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు భారతి, వరలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు సాజిదాఫిర్దోస్‌కు మే 20న చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అపర్ల, జ్యోతి, శాంతి, నాగలక్ష్మీ, వరలక్ష్మీ, రవణమ్మ, సంతోషమ్మ, హసీనా, భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

ధనుంజయ ఆశయాలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాగన్న

ఆత్మకూరు, మే6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ధనుంజయుని ఆశయాలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న, డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ రాయుడు, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ అజయ్‌కుమార్, సీపీఎం సీనియర్ నాయకులు రాజశేఖర్ పేర్కొన్నారు మంగళవారం ధనుంజయ 19వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో సీపీఎం పార్టీని స్థాపించి పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. అలాగే వైద్యవృత్తిలో కూడా నిరుపేదలను ఆదుకున్న ఘనత ఆయనదని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రణధీర్, రజాక్, సురేంద్ర, రామ్‌నాయక్, మాబాషా, స్వాములు, దాసు, కిరణ్ తదితరులు ఉన్నారు.

పెను భూతంలా బయో వ్యర్థాలు



డంప్‌యార్డులో పేరుకుపోయిన చెత్త

- నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రుల చెత్త తరలింపు
- భారీగా పురపాలక సంఘం ఆదాయానికి గండి
- ఆసుపత్రుల చెత్త మూడు రోజులు నిలిపివేత
- నాయకుల ఫోన్ కాల్స్‌తో మళ్లీ తరలింపు

నంద్యాల టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆసుపత్రులు సుమారుగా 100 ఉన్నాయి. వీటిలో 10 నుంచి 15 పెద్ద ఆసుపత్రులు. నంద్యాల మెడికల్ కళాశాల, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నాయి. వీటి నుంచి వచ్చే చెత్తను మాత్రం ఆసుపత్రులు అందరూ కలిసి అసోసియేషన్‌గా ఏర్పడి ప్రత్యేకంగా బయో చెత్తను తరలించుకోవాలి. ఇందుకు భిన్నంగా నంద్యాలలో మున్సిపాలిటీ సిబ్బంది అడ్డగోలుగా బయో వ్యర్థాలను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పురపాలక సంఘానికి, ఆసుపత్రుల చెత్తను తరలించాలనే నిబంధనలే లేవు. కానీ పారిశుధ్యం విభాగం వారు ఆసుపత్రుల యజమానుల నుంచి మమూళ్లు తీసుకుని బయో వ్యర్థాలను నంద్యాల డంప్ యార్డులో చేరుస్తున్నారు. గత మూడేళ్ల కిందట ఓ సారి రీసైక్లింగ్ చేసి మధ్యలోనే వదిలేశారు. ప్రస్తుతం ఆ చెత్త అలాగే వదిలేయడంతో కంపుకొడుతోంది. ఈ డంపు యార్డు పక్కనే పీవీ నగర్ కాలనీ ఉంది. దుర్వాసనతో కాలనీ వాసులు అనారోగ్యాల పాలవుతున్నారు.

రెండు ఆసుపత్రులకే అనుమతి ఉంది!.

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ప్రాంతంలో ఉన్న ఒక పెద్ద ప్రైవేటు ఆసుపత్రి, పట్టణ శివారులో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రి చెత్తను మాత్రం తీసుకొని రావాలని అధికారులు చెప్పినట్లు సమాచారం. ఇందులో కేవలం సాధారణ వ్యర్థాలు వస్తాయని చెబుతున్నారు. కానీ ఆ రెండు ఆసుపత్రులకు ఎందుకు అంత ప్రత్యేకత..? అన్న ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రుల చెత్త సంబంధం లేదన్న అధికారులు కేవలం ఆ రెండు ఆసుపత్రుల నుంచి ఎందుకు త రలిస్తున్నారు. కానీ అందులో బయో వ్యర్థాలు ఉన్నాయన్న అనుమానాలు ఉన్నాయి.

చెత్త తరలింపులో...అవినీతి కంపు



నిబంధలనకు విరుద్ధంగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి చెత్తను తరలిస్తున్న మున్సిపాలిటీ చెత్త వాహనం

నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్యం విభాగం వారు టెండర్ వేసుకుని చెత్తను ప్రత్యేక వాహనంలో తరలించాలి. కానీ ఆరేళ్ల నుంచి పురపాలక సంఘం వారు తరలిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్యం విభాగం కాంట్రాక్టర్ చెత్త వాహనం డ్రైవర్‌కు నెలకు రూ.3వేలు ఇస్తున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి చెత్త తరలింపునకు రూ.లక్షల్లో తీసుకుంటూ ఈ అవినీతికి పాల్పడుతున్నారు.

ఉన్నతాధికారులు పట్టించుకోరూ..

మూడు రోజుల క్రితం విషయం తెలుసుకున్న పారిశుధ్య విభాగం అధికారి ఒకరు చెత్త తరలించడం ఆపేశారు. మళీ కొందరి నాయకులు ఫోన్ కాల్స్‌తోనో, లేక మమూళ్లు తీసుకుని తరలించడానికి ఒప్పుకున్నారనే చర్చ నడుస్తోంది.

- ఇన్ని చేస్తున్న ఏఒక్కరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విశేషం.
- అలాగే ప్రైవేటు ఆసుపత్రుల చెత్తను వారి యజమానుల నుంచి మమూళ్లు తీసుకుని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇందులో ఎయిడ్స్‌కు సంబంధించిన వ్యర్థాలు, సూదులు, సిజేరియన్ కత్తులు ఇవన్నీ ఉండడం వల్ల పారిశుధ్య కార్మికులకు ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆదాయానికి గండి..

ఇలాంటి అవినీతి చర్యలకు పాల్పడడం వల్ల, నిబంధనలకు విరుద్ధంగా చెత్తను తరలించడం వల్ల పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఎటువంటి చలానాలు కట్టకుండా కేవలం డ్రైవర్లు కొందరు పారిశుధ్య కార్మికులు, పారిశుధ్య విభాగం అధికారులు చేసినా అవినీతి పనుల వల్ల రూ. కోట్లల్లో గండి పడుతోంది.



విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రుల చెత్త పురపాలక సంఘానికి ఎటువంటి సంబంధం లేదు. కానీ తరలిస్తున్నారే విషయం తెలిసింది. ఎక్కడ తప్పు జరుగుతోందో పరిశీలించి వారిపై చర్యలు తీసుకుంటాం.

వెంకటదాస్, అసిస్టెంట్ కమిషనర్, నంద్యాల

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మహానంది, మే 6 (ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయకళాశాల ఆవరణలో వ్యవసాయ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. యూపీఎస్సీ పరీక్ష విధానం, ప్రిలిమ్స్, మెయిన్స్ ఇంటర్వ్యూలపై విషయ నిపుణుడు భవాని శంకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల గ్రంథాయాలనికి 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ, హైదరాబాద్, రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించి, శాస్త్రవేత్తలకు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, కళాశాల అసిస్టెం ట్ డైరెక్టర్ ఎల్. విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఉత్పత్తులు

కొత్తపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఉత్పత్తులు దిగుబడి చేసుకోవచ్చునని వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, ప్రకృతి వ్యవసాయ మాడల్ మేకర్ ట్రైనీ సయ్యద్ బాషా అన్నారు. మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వార్షిక ప్రణాళికపై గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ జహీద్, వెలుగు సీసీ రమణ, యూనిట్ ఇన్‌చార్జిలు సరస్వతమ్మ, ప్రకృతి సేద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టుల భర్తీకి సీఎం దృష్టికి తీసుకెళ్తా: మంత్రి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఉర్దూ అసోసియేషన్ నాయకులు

నంద్యాల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025లో బ్యాక్‌లాగ్ ఉర్దూ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌నజీర్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2025లో బ్యాక్‌లాగ్ ఉర్దూ పోస్టులను డి-రిజర్వు చేసి ప్రస్తుత డిఎస్సీ ద్వారా జనరల్ కేటగిరి అభ్యర్థులతో భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉర్దూ పోస్టుల భర్తీకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉర్దూ స్కూల్స్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ హష్మద్దీన్, అసోసియేషన్ నాయకులు ఇబ్రహీం, నౌమాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

జూపాడుబంగ్లా, మే 6(ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలను జయప్రదం చేయాలని వ్యకా.స.జిల్లా నాయకులు కర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి మౌనికకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆశకార్యకర్తలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు తక్కువ వేతనానికి పనిచేస్తున్నారని, కనీసవేతనం రూ. 26వేలు అందజేయాలని డిమాంతిడ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాములపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని క్రిష్ణరావుపేట గ్రామంలో టిప్పర్ ఢీకొన్న సంఘటనలో లోకేశ్వెరెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. మంగళవారం పాములపాడు గ్రామానికి చెందిన లోకేశ్వెరెడ్డి నందికొట్కూర్‌కు ద్విచక్ర వాహనంపె వెళ్తుండగా క్రిష్ణరావుపేట ప్రధాన రహదారిపై టిప్పర్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితున్ని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హెల్ప్ చేయని డెస్క్



హెల్ప్ డెస్క్ ముందు స్పృహ కోల్పోయిన నరసింహా

నంద్యాల హస్పిటల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆసుప్రతులకు వచ్చిన వారికి సమాచారం, సలహాలు ఇచ్చేందుకు, ప్రభుత్వం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. అయితే నంద్యాల జీజీహెచ్ ఆసుపత్రిలో ఐసీయూ పక్కనే ఉన్న హెల్ప్ డెస్క్ ఎవరూ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం సాయంత్రం అత్యవసర నిమిత్తం పార్నపల్లికి చెందిన నరసింహా అనే రోగి కడుపు నొప్పి, వాంతులతో ఆసుపత్రికి వచ్చారు. ఎక్కడికి వెళ్లాలో తెలియక భార్య పలువురిని ఆశ్రయించింది. ఆసుపత్రి సిబ్బంది ఎవరూ సాయం చేయకపోవడంతో నరసింహా భార్య స్వయంగా వార్డుకు చికిత్స కోసం తీసుకొచ్చింది. హెల్ప్‌డెస్క్ వద్ద సిబ్బందిఎవరూ లేరన్న విషయం ఆంధ్రజ్యోతి అక్కడున్న నర్సులను అడగగా మధ్యాహ్నం వరకు ఉన్నారు అని చెప్పడం విశేషం.

సాయినాట్యాంజలి విద్యార్థుల ప్రతిభ

నంద్యాల కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన కూచిపూడి సాయినాట్యాంజలి సంస్థ విద్యార్థులు హైదారాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటారని నంద్యాల సాయినాట్యాంజలి కూచిపూడి సంస్థ నిర్వాహకులు డా.పల్లం శెట్టి సురేష్, నాట్యగురువు డా. నళిని తెలిపారు. శ్రీచక్రమ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనృత్య పోటీలు నిర్వహించారన్నారు. ఈ ప్రదర్శనకు ఆంధ్ర, తెలంగాణా నుంచి విద్యార్థులు పాల్గొన్నారని, జతీశ్వర్యం, రామాయణ శబ్దం, కృష్ణ శబ్దం వంటి కూచిపూడి నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఆహూతులను ఆకట్టుకున్నారని తెలిపారు.

రీసర్వేను పకడ్బందీగా చేపట్టండి

ఆత్మకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీవెంకటేశ్వర కల్యాణ మంటపంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రీసర్వేకు సంబంధించి రైతుల ధృవీకరణ పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. అదేవిధంగా రీసర్వే వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన గడవులోగా రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఐలు రవీందర్‌పాల్, ఉమాపతి, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు ఉన్నారు.

చట్టాలపై కార్మికులు అవగాహన పెంచుకోవాలి

నందికొట్కూరు, మే 06 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై మున్సిపల్ కార్మికులు అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ బేబి అన్నారు. మంగళవారం జైకిసాన్ పార్కులో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమకు ఉన్న విధులు, హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వెంకటరమణ, సోషల్ వర్కర్ శోభారాణి, కోర్టు పారా లీగల్ వలంటీర్ బొల్లెద్దుల చిన్నరాజు, కేజియా హసన్‌మియా తదితరులు పాల్గొన్నారు.

శక్తి టీం అవగాహన ర్యాలీ

నంద్యాల టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): శక్తి టీం మహిళల భద్రత కోసం పని చేస్తుందని ఆ టీం మహిళా కానిస్టేబుళ్ల పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐ గౌతమి మాట్లడుతూ వేసవి కాలం సెలవులు ఉన్నందున చాలామంది ఆడ పిల్లలు ఇంటి వద్దనే ఉన్నారు వారి భద్రత కోసం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా శక్తి టీం యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని సమాచారం ఇస్తే వారికి వెంటనే రక్షిస్తామన్నారు. ప్రభుత్వం మహిళల కోసం ఇటువంటి యాప్‌ను ప్రవేశపెట్టింది. దీనిపై కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో, గ్రామాల్లో అవగాహన కూడా కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో నంద్యాల జిల్లా శక్తి టీం, సబ్ డివిజన్ శక్తి టీం కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఓర్వకల్లు విమానాశ్రయంలో పైలట్ అకాడమి

నంద్యాల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు విమానాశ్రయంలో పైలట్ ట్రైనింగ్ అకాడమికి నిధులు మంజూరైనట్లు నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల పెట్టుబడి విభాగం ఆధ్వర్యంలో ఓర్వకల్లు విమానాశ్రయంలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కి కనెక్ట్ చేసే టాక్సీవేని అందించడం కోసం రూ.2.27 కోట్లు మంజూరు చేసి పరిపాలనా అనుమతి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఓరియంట్ ఫ్లైట్స్ ప్రవేట్ లిమిటెడ్ కర్నూల్ విమానాశ్రయంలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ స్థాపించిందని తెలియజేశారు.

పోలీస్ యంత్రాంగంపై రాజకీయ జోక్యాన్ని ఆపాలి

నంద్యాల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ యంత్రాంగంపై రాజకీయ జోక్యాన్ని ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా అయిన తర్వాత జిల్లాలో హత్యలు, దాడులు పెరిగాయన్నారు. పోలీసులు నేరాల తగ్గించేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. సమావేశంలో జిల్లాసహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘ జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : సుధీర్



మాట్లాడుతున్న వైసీపీ నాయకుడు సుధీర్

నందికొట్కూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భరోసా ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వైసీపీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటుతున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యకర్తలపైన అక్రమ దాడులు చేస్తున్నారన్నారు. వీటిని త్వరలో తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు సోముల సుధాకర్‌రెడ్డి, పోచా జగదీశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, రమేష్ నాయుడు, తిరుమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్‌గా భూమా కృష్ణమోహన్ రావు

మిడుతూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మిడుతూరు లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్‌గా భూమ కృష్ణమోహన్‌రావు ఎన్నికయ్యారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను, మాండ్ర సురేంద్రనాథను, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయ చైర్మన్ పదవికి కృషి చేసిన వారికి శాలువలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ శ్రీనాథ్ రెడ్డి, కృష్ణ మూర్తి, వెంకటేశ్వర్లు, రోశయ్య పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

పాములపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలపల్లి గ్రామంలో పండ్ల తోటల పెంపకంపై కోర్సు డైరెక్టర్ ఇస్మాయిల్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా వందశాతం సబ్సిడీపై మామిడి, నిమ్మ, సీతాఫలం, సపోట, జామ, కొబ్బరి, నేరేడే, అంజీర, రేగు మొక్కలు అలాగే ఎకరా నుంచి ఐదు ఎకరాల వరకు మల్లె, గులాబీ పూల తోటలు. మునగ ఒక ఎకరా వరకు ఇస్తున్నామని అన్నారు. ఆసక్తి గల రైతులు ఉపాది సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

మహానంది, మే 6 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సు బాలికలు పరిశుభ్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అవగాహన పెంచుకోవాలని మహిళ పోలీస్ నాగ హరిత, ఏఎన్ఎం అరుణ తెలిపారు. మంగళవారం మహానంది మండలం అబ్బీపురం లోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం, వేషవిసెలవుల కార్యక్రమాల్లో భాగంగా బుతుస్రావం-పరిశుభ్రత గురించి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సావిత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా వ్యాపారులకు బెల్లం విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు

నందికొట్కూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులకు బెల్లం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు పట్టణంలోని కిరాణ మర్చెంట్ వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అల్వాల వారి కల్యాణ మండపంలో కిరాణా మర్చంట్ అసోసియేషన్, నిత్యావసరాలు హోల్‌సెల్ డీలర్స్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రాముడు మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలోని నీలిషికారి కాలనీతో పాటు కోళ్ళబావాపురం గ్రామంలో నాటుసారా తయారీ దారులు అధికంగా ఉన్నారని, వారికి అధికంగా బెల్లం అమ్మకాలు చేయకూడదన్నారు. లైసెన్సులు కలిగిన ప్రతి వ్యాపారి బెల్లం క్రయవిక్రయాల వివరాలు ఎప్పటికప్పుడు సంబంధిత శాఖ అధికారులకు అందించాలన్నారు. సమావేశంలో కిరాణం మర్చెంట్ అసోసియేషన్ నాయకులు మన్సూర్, వజీర్ బాషా, నగేష్ ప్రసాద్, సతీష్, ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు, ఎస్.ఐ. జఫ్రుల్లా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నందికొట్కూరు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్టిక్కర్స్‌ను పట్టణ సీఐ, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు రఘురాంమూర్తి విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, నాగేశ్వర్‌రావు, నాగరాజు, మాలిక్, మధు, శివ తదితరులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మోహినీ అలంకరణలో జ్వాలా నృసింహస్వామి



ఉత్సవమూర్తుల ఊరేగింపులో అర్చకులు

ఆళ్లగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో నృసింహస్వామి జయంతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నరసింహ స్వామి మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి, మణియర్ సౌమ్య నారాయణ్‌ల ఆధ్వర్యంలో అభిషేకాలు, నవ కలశ తిరుమం జనం నిర్వహించారు. అలాగే సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామిని శరభ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్‌కు చెందిన పరుచూరి వెంకటేశ్వరరావు, వేంపల్లెకు చెందిన బొమ్మిరెడ్డి నారాయణరెడ్డి, విజయవాడకు చెందిన విజయ్‌కుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు.

'కార్మికుల కోసం న్యాయ పోరాటం'

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల మండలంలోని సిమెంటునగర్ పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల కోసం న్యాయ పోరాటం చేస్తామని టీడీపీ డోన్ నాయకుడు మర్రి రమణ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీకి చెందిన కార్మికులతో కలిసి ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నడిపిన పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఉద్యోగ భద్రత కోసం, జీతాల చెల్లింపుల కోసం న్యాయ పోరాటం చేస్తామని మర్రి రమణ పేర్కొన్నారు. 15 రోజుల వరకు వేచి చూస్తామని, కార్మికులకు న్యాయం జరగకపోతే కర్నూలులో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మద్దయ్య గౌడు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమసుందర్ రెడ్డి, బీజేపీ నాయకులు రవికుమార్, జనసేన కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం, కార్మికులు (ఉద్యోగులు) మోజెస్, హనుమంతరావు, రామసుబ్బయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు'

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వైద్య సిబ్బంది అన్నారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీహెచ్‌వోలు, సీహెచ్‌వోలు తమకు చదువు రాదని, జీతాలు దండగా అని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మృతి బాధాకరం

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుగూడెం హెచ్‌ఎం ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘ నాయకులతో కలిసి ప్రసాద్ మృతికి సంతాపం తెలిపి మౌనం పాటించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హంజాద్‌బేగ్, మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

బనగానపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బ్రహ్మానందారెడ్డి, ఆలయ పూజారి మఠం శ్రీనివాసాచార్యులు మంగళవారం తెలిపారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా 7న ఆరాధన, పల్లకీ ఉత్సవం వేడుకలు, 8న గ్రామోత్సవం, 9న మహానివేదన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ వేడుకలు చింతమాను మఠంలోనూ, రవ్వలకొండలోనూ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం

బనగానపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): బహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. పలుకూరు గ్రామంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బలసరస్వతి భజన మండలి అధ్యక్షుడు బాలహనుమంతు, జగన్‌మోహన్‌రెడ్డి, రమణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో ఆదాయం చేకూర్చండి

కోవెలకుంట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : చెత్తతో వర్మీ కంపోస్టు ఎరువులు తయారుచేసి పంచాయతీకి ఆదాయం చేకూర్చాలని కోవెలకుంట్ల డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో కోవెలకుంట్ల, సంజామల మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు చెత్త సంపద కార్మికులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవోలు వరప్రసాదరావు, సాల్మన్, సంజామల డిప్యూటీ ఎంపీడీవో రాధికారెడ్డి పాల్గొన్నారు.

లింగమయ్య స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎంపీపీని పరామర్శించిన అధికారులు

అవుకు, మే 6 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన అవుకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చల్లా రాజశేఖర్‌రెడ్డిని మంగళవారం అధికారులు పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామప్ప, ఎంపీడీవో వెంగన్న, వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్, ఎంఈవో శ్రీధర్‌రావు, ఏవో శ్రీరామ్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్, సచివాలయాల అధికారులు ఉన్నారు.

నేడు వాసవీమాత జయంతి

కొలిమిగుండ్ల, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనాయిని పేటలో బుధవారం వాసవీ మాత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం వెల్లడించారు. ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటి పెద్దల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు సుధాకరశెట్టి తెలిపారు.

11న ఆలయ వార్షికోత్సవం

రుద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీ తీర ప్రాంతంలో కొలువుదీరిన గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు.

ప్రకటనలకే 'నవోదయం'

- విచ్చలవిడిగా నాటుసారా తయారీ
- గ్రామాల్లో జోరుగా విక్రయకేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

బనగానపల్లె, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నవోదయం-2 పథకం ప్రకటనలకే పరిమితమవుతోంది. నియోజకవర్గంలో నాటుసారా తయారీ కేంద్రాలు విచ్చలవిడిగా వెలిశాయి. మద్యాన్ని నియంత్రించడానికి ఎక్సైజ్ శాఖలు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటనలు ఇస్తున్నారే గాని గ్రామాల్లో నాటుసారా తయారీ ఆపడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ, బనగానపల్లె పట్టణంలోనూ నాటుసారా అమ్మకాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం నాటుసారా తయారీ, విక్రయదారుల్లో మార్పు తీసుకు రావడానికి నవోదయం-2 పథకానికి శ్రీకారం చుట్టింది. అయినా వారిలో మార్పులు రావడం లేదు.

కుటీర పరిశ్రమగా నాటుసారా తయారీ

నాటుసారా తయారీ బనగానపల్లె నియోజకవర్గంలో కుటీర పరిశ్రమగా మారింది. నాటుసారా లీటరు ఒకప్పుడు రూ.100 ఉండేది. ప్రస్తుతం రూ.400 నుంచి రూ.500 వరకు ఎగబాకింది. మద్యం ధరలు తగ్గినా నాటు సారాకు డిమాండ్ పెరగడం విశేషం. బనగానపల్లె మండలంలోని చిన్నరాజుపాలెం చిన్నరాజు పాలెం తండా, పసుపుల, పసుపుల తండా, అలేబాద్‌తండా, పెద్దరాజుపాలెం, రామతీర్థం, యర్రగుడి, బీరవోలు, అవుకు మండలం గడ్డ మేకలపల్లె, మంగంపేట తండా, ఇస్రా నాయక్ తండా, కొండమనాయునిపల్లె , మన్నేనాయక్ తండా, మర్రికుండతండా, పిక్కిళ్లపల్లె తండా, కొలిమిగుండ్ల మండలంలోని ఉమ్మాయిపల్లె తండా తదితర గ్రామాల్లోని కొండల్లో నాటు సారా బట్టీలు కుటీర పరిశ్రమలుగా మారాయి. గతంలో వందకు పైగా మోటారు సైకిళ్లన ఎక్సైజ్ శాఖ అధికారులు సీజ్ చేసి వేలం వేశారు..అయినా నాటు సారా తయారీ, సరఫరా, విక్రయాలు ఆగడం లేదు.



ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన నాటుసారా బట్టీ

బహిరంగంగా విక్రయాలు

నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని ప్రతి గ్రామంలో నాటుసారా విక్రయ కేంద్రాలు ఉన్నాయి. బనగానపల్లె పట్టణంలోనే నాటుసారా అంగళ్లు బహిరంగంగా విక్రయాలు చేస్తున్నారు. పట్టణ నడి బొడ్డున జుర్రేరు వాగు సమీపంలోను, గంగమ్మ గుడి, తెలుగు పేటలో నాటుసారా విక్రయకేంద్రాల్లో రేయింబవళ్లు నాటుసారా విక్రయకేంద్రాలు బహిరంగంగా నడుపుతున్నారు. కేసులు కఠినంగా లేక పోవడంతో యథేచ్ఛగా సారా తయారీ, విక్రయాలు కొనసాగిస్తున్నారు.

తొలుత కాస్త విజయవంతమైన..

రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా రహితంగా తీర్చిదిద్దడానికి ఎక్సైజ్ శాఖ నవోదయం 2.0కు శ్రీకారం చుట్టింది. తొలుత నెలపాటు అధికారులు నాటుసారా తయారీ, విక్రయాలు జరిగే గ్రామాన్ని సందర్శించి అవగాహన కల్పించారు. సమన్వయ కమిటీలు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసి చేశారు. నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తారు. అనంతరం ప్రత్యామ్నాయ, ఉపాధి పునరావాసం కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకునే విధంగా నవోదయం -2 కార్యక్రమానికి ప్రభుత్వం విజయవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించింది. బనగాన పల్లె నియోజ కవర్గంలోని నాటుసారా ప్రభావిత గ్రామాల్లో బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్ఐ కరుణాకర్ నాటుసారా ప్రభావిత గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కాని మార్పు నాటుసారా , తయారీ దారుల్లో మార్పులు మాత్రం రావడంలేదు. నవో దయం 2.0 ఫలితం ఇవ్వలేదు. అక్రమ నాటు సారా తయారీదారులపై పీడీ చట్టాలు అమలు చేస్తామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. కానీ ఇవి మాటలకే పరిమితమైంది.



కొలిమిగుండ్ల మండలం బెలుం సింగవరంలో అవగాహన కల్పిస్తున్న బనగానపల్లె ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

కఠిన శిక్షలు నిల్

నాటుసారా విక్రయాలు, బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నా వాస్తవానికి ఆపరిస్థితి లేదు. ఎక్సైజ్ అధికారులు నాటుసారా విక్రయిస్తే పీడీచట్టం పెడతామని హెచ్చరిస్తున్నా మార్పులు రాలేదు. కారణం పీడీ చట్టం మాత్రం అమలు కావడం లేదు. ఎందుకు అమలు కావడం లేదో ఎక్సైజ్ అధికారులకే ఎరుక. కేసులు కఠినంగా లేకపోవడంతో యథేశ్చగా నాటుసారా తయారీ, కోర్టుల్లో ఫైన్ కట్టడం తిరిగి యథావిధిగా నాటుసారా విక్రయాలు కొనసాగుతూనే ఉన్నారు.

> **మార్పునకు కృషి చేస్తున్నాం**
>
> నవోదయం. 2.0లో భాగంగా పలు గ్రామాల్లో అవగాహన కల్గిస్తున్నాం తయారీ, విక్రయదారుల్లో మార్పునకు కృషిచేస్తున్నాం. గ్రామాల్లో గ్రామసభలు పెట్టి నాటుసారాతో కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తున్నాం. ఇంకా మార్పులు రాకుంటే పీడీ చట్టాన్ని ప్రయోగిస్తాం.
>
> - కరుణాకర్, ఎక్సైజ్ ఎస్ఐ, బనగానపల్లె

త్వరలో పేదలకు ఇంటిపట్టాలు ఇస్తాం: మంత్రి బీసీ

బనగానపల్లె, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇస్తామని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లెలో మంత్రి బీసీ మాట్లాడుతూ ఇళ్లులేని ప్రతి పేదకు రెండు సెంట్లు ఇంటి పట్టాలు ఇస్తామని గతంలో మాట ఇచ్చామని ఆమాట త్వరలో నెరవేరుస్తామన్నారు. పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వ భూములు సేకరించాలని తహసీల్దారు నారాయణరెడ్డి, ఆర్డీవో నరసింహులును మంత్రి ఆదేశించారు. రెవిన్యూ అధికారుల పరిశీలనంలో భాగంగా భానుముక్కల గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని కోరారు. అలాగే ఆటోనగర్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం

టీడీపీ సీనియర్ నాయకుడు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాల కొండరాయుడు మృతిపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తనను ఎంతో కలచివేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లోనే కొనసాగించాలని, కార్మికులందరినీ రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కి ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తూ అష్టకష్టాలతో పడుతున్నారన్నారు. ఈ నెల 7 నుంచి ఇంజనీరింగ్ కార్మికుల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, 20న కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెలో విధులు బహిష్కరించి పాల్గొంటారని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.అన్వర్ జి.అబ్బాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు హరి, నాయకులు సంజీవ కుమార్, అజయ్ రెడ్డి, చంద్ర, గౌస్, రంగస్వామి, సురేష్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

కోవెలకుంట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం నిర్మాణం జరిగి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు మూడో రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గరుడాద్రి రమేశ్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సీతారాముల కల్యాణ వేడుకల్లో వరుడి తరఫున కర్నాటి సుమాంజలి -గుప్తలు వారి కుమారులు , అలాగే వధువు తరుపు బైసాని ప్రకాశ్, ఉమామహేశ్వరి దంపతులు వారి కుమారుడు కూర్చుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5.30కు ప్రదోష కాల పూజ, 108 పర్యాయములు లలిత సహస్ర నామ పారాయణం జరిగింది. మహిళా మండలి ఆధ్వర్యంలో 50మంది ఆర్యవైశ్య మహిళలకు మహిళా మండలి వారిచే వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పెండేకటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కల్చర్ ప్రోగ్రాం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పెండేకంటి నాగరాజు, కాల్వ శివనాగయ్య, నాగేశ్వర్‌రావు, కర్నాటి అభిలాష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న కర్నాటి సుబ్బరాయుడు గుప్త దంపతులు, బైసాని రవి ప్రకాశ్ దంపతులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసౌకర్యాన్ని ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వవిద్యార్థులు

కొలిమిగుండ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగుడి ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2005-06 విద్యాసంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. సుమారు 20ఏళ్ల తరువాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. దీంతో ఎర్రగుడిలో పండుగ వాతావరణం నెలకొంది.

భూసార పరీక్షలు తప్పనిసరి

దొర్నిపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. పంట మార్పిడిలు చేయడం వల్ల పంట దిగుబడి బాగా ఉంటుందని రైతులకు తెలియజేశారు.

అదుపు తప్పి రోడ్డుపై నిలిచిన కంటైనర్

ప్యాపిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం భారీ కంటైనర్ అదుపు తప్పి రోడ్డుపై నిలిచింది. హైదరాబాద్ నుంచి బెంగుళూరు గూడ్స్‌తో కంటైనర్ వాహనం బయలు దేరింది. మార్గం మధ్యలోని పోతుదొడ్డి సమీపంలోకి రాగానే అందుపు తప్పి కంటైనర్ డివైడర్ దాటి రోడ్డుకు అడ్డంగా నిలిచింది. దీంతో వాహనాల రాకపోకలు గంటసేపు స్తంభించి పోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని ప్రక్కకు పెట్టించి రాకపోకలను కొనసాగించారు.

సబ్ రిజిస్ట్రార్ కోసం ఎదురు చూపులు

- గంటల తరబడి కార్యాలయం వద్ద ప్రజలు నిరీక్షణ



కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

ప్యాపిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు సమయ పాలన పాటించడం లేదు. అధికారుల కోసం ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. మంగళవారం మండల కేంద్రం లో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కోసం కార్యాలయం దగ్గర గంటల తరబడి ప్రజలు నిరీక్షించారు. అయినా అధికారి విధులకు రాకపోవడంతో పలు వురు వెనుతిరిగి వెళ్లారు. ఇక్కడ పని చేసే సబ్ రిజిస్ట్రార్ అనంతపురంలో నివాముంటూ విధులకు సక్రమంగా రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఒకవేళ వచ్చిన ఎప్పుడొచ్చేది తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రోజూ భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ నిర్వాహణ సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మల్లెలమ్మకు ప్రత్యేక పూజలు

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలో మల్లెలమ్మ ఆలయంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన శివకుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు మల్లెలమ్మ పూజా కార్యక్రమానికి ఆయన కుటుంబ సమేతంగా హాజరై విశేష పూజలు చేశారు.

వైభవంగా సాయి పాదుకల గ్రామోత్సవం



పాదుకల ఊరేగింపులో భక్తులు

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో సాయి భక్తుల ఆధ్వర్యంలో షిరిడీ సాయి పాదుకలను మంగళవారం గ్రామోత్సవం నిర్వహిం చారు. ఒంగోలు నుంచి తీసుకొచ్చిన పాదుకలను కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేసి అనంతరం అయ్యప్పస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. సాయి మందిరంలో పాదుకలు కొలువుదీరింపచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పాదుకల దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో సాయి మాస్టర్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్, సుబ్బారావు, కాశీ, సాయి సేవకులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు పూజలు

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడులో పెద్దమ్మతల్లి దేవర సందర్భంగా మంగళవారం గ్రామస్థులు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికి వెళ్లి అన్నం స్వీకరించి అమ్మవారికి చల్లపోసి శాంతి కలిగించారు. పంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ పెద్దమ్మ తల్లికి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి మార్చాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని షాదీఖానా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలని సీపీఎం, పట్టణ మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం డోన్ ఆర్డీవో నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు ఏవీ భాస్కర్ రెడ్డి, శివరాం, చిన్న రెహిమాన్ పాల్గొన్నారు.

మస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు చేసే శ్రామికుల మస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి ఏపీవో ఖాసీం హెచ్చరించారు. మంగళవారం మల్లేవేముల గ్రామ సమీపంలోని కేసీ ప్రధాన కాలువలో చేస్తున్న పూడిక పనులను పరిశీలించారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్‌లు పాల్గొన్నారు.

వడదెబ్బ సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువులకు వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మూగ జీవాలను ఎండలో తిరగనివ్వకుండా నీడనిచ్చే ప్రదేశాల్లో ఉండేలా చూడాలని అన్నారు. వడదెబ్బ సోకిన పశువునుల గుర్తించి చికిత్స చేయించాలని అన్నారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి

బేతంచెర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆశావర్కర్లు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పీహెచ్‌సీలో డాక్టర్ అబ్దుల్ ఆలీమ్‌కు, బేతంచెర్ల పట్టణంలోని దర్గా దగ్గర ఉన్న హెల్త్ సెంటర్ దగ్గర డాక్టర్ ప్రియాంకకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, మండల కార్యదర్శి ఎస్.రహంతుల్లా సమ్మె నోటీసులను అందజేశారు. కార్యక్రమంలోఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, ప్రోగ్రాం సీఆర్పీ అశోక్, ఉద్యాన శాఖ అధికారి రాముడు, రైతులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

డోన్ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో వెంకటనాయునిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం సర్పంచ్ అభినందించారు. కార్యక్ర మంలో ప్యాపిలి టీడీపీ నాయకులు ఘన మద్దయ్య, వెంకటనాయునిపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాథ్ పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి సామగ్రి పంపిణీ



కార్మికులకు కొబ్బరి నూనె అందజేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రాజేష్

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం శానిటేషన్ సిబ్బంది రెండు సంవత్సరాలకు సరిపడ సబ్బులు, కొబ్బరి నూనె, దుస్తులు, చెప్పులను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్‌గౌడు, శానిటేషన్ అధికారులు సునీల్‌బాబు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

డోన్ మున్సిపల్ ఆర్వోగా శ్యామలరాజు

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపల్ రెవెన్యూ ఆర్వోగా జే. శ్యామలరాజు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్వో ఎస్. వెంకటరెడ్డి నంద్యాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గుంతకల్లు పురపాలక సంఘం నుంచి పదోన్నతిపై డోన్ రెవెన్యూ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చారు.

'ప్రైవేట్'లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

కొలిమిగుండ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 20శాతం సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం మంగళవారం వెల్లడించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు, పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు పరిశీలించి, సీట్లు కేటాయిస్తారని అన్నారు.

మంత్రిని కలిసిన కూటమి నాయకులు

డోన్ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, నాయకులు వలసల బాలుడు మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి సవిత పెనుగొండ నుంచి డోన్ మీదుగా విజయవాడకు బయలుదేరి వెళ్లారు.